క్లుప్తంగా

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

కొత్తపట్నం: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా జరిగేందుకు పోలీస్ శాఖ పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తోంది. అందులో భాగంగా స్థానిక ఎస్సై బి.సాంబశివరావు ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో శుక్రవారం పోలీస్ కవాతు నిర్వహించారు. బీఎస్ఎఫ్, ఆర్మీ రిజర్వు, సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో కొత్తపట్నం రెడ్డిపాలెం, మోటుమాలలో పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఓటర్లు నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, అందు కోసమే కవాతు నిర్వహిస్తున్నామని అన్నారు. ఎవరైనా మందుకు, నగదుకు తమకు ఓటేయాలని ప్రలోభపెడితే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పోలీస్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ బూత్‌లకు 100 మీటర్ల దూరంలో ప్రజలు ఉండాలన్నారు. నలుగురు, ముగ్గురు అంతకంటే మించి గుంపుగా చేరితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. 52 మంది కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించగా, స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

లైవ్ వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్



లైవ్ వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 13న జరిగే పోలింగ్ ప్రక్రియను లైవ్ వెబ్ కాస్టింగ్ ద్వారా స్పష్టంగా వీక్షించేందుకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమాండ్ కంట్రోల్ కేంద్రంలో లైవ్ వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. లైవ్ కాస్టింగ్ ఒక నియోజకవర్గంలోని అన్నీ పోలింగ్ కేంద్రాలను ఒకేసారి వీక్షించేలా ఎల్ఈడీ స్క్రీను ఏ విధమైన అవరోధాలు లేకుండా ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ శ్రీలత, కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్ ఇతర అధికారులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి

- ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి



ఒంగోలు రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు రూరల్: రాష్ట్రంలో, ఒంగోలు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం దూసుకుపోవాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అధికారంలోకి రావాలని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఉదయం 7 గంటలకు ఒంగోలు మండలంలోని సర్వేరెడ్డిపాలెంలో బాలినేని రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో పేదలకు భారీగా సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు ఒంగోలు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పూర్తి చేశామని చెప్పారు. ఒంగోలు-యరజర్ల రోడ్డు నిర్మించానని, ఒంగోలు-సర్వేరెడ్డిపాలెం రోడ్డును నూతనంగా ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా పాలకేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. తద్వారా పాడిరైతులు లాభాలు పొందుతున్నారన్నారు. గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలను అప్‌గ్రేడ్ చేసి నాడు-నేడు కార్యక్రమంలో నూతన భవనం, అదనపు తరగతి గదులు, పైఅంతస్తు నిర్మించామని వివరించారు. సంక్షేమ పథకాల్లో భాగంగా డీఆర్‌డీఏ ద్వారా చేయూత, ఆసరా, శ్రీనిధి, చిన్నకారు వ్యాపారస్తులకు రుణాల మంజూరు, పాడి పశువుల కొనుగోలుకు రుణాలు మంజూరు, రైతులకు వ్యవసాయ పనిముట్ల కొనుగోలుకు సబ్సిడీపై రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఒంగోలులో రూ.25 వేల మందికి ఇళ్ల పట్టాలు అందజేశామని, అండర్ గ్రౌండ్ కేబుల్ పనులు పూర్తి చేశామని చెప్పారు. పోతురాజు కాలువను శుద్ధి చేశామని, మండలంలోని గుండాయపాలెం, ఒంగోలు, చేజర్ల, ఆలూరు రోడ్డు, చేజర్ల-ఆలూరు రోడ్డు, గుండాయపాలెం-పాతపాడు రోడ్డు, ఒంగోలు-గుండాయపాలెం రోడ్డు పూర్తి చేశామని బాలినేని వివరించారు. తీర ప్రాంతంలో భారీ వర్షాలకు, తుఫాన్లకు విద్యుత్ అంతరాయం తలెత్తకుండా రూ.2 కోట్లతో నూతన విద్యుత్ లైన్లు, కండెన్సర్లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మళ్లీ వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని బాలినేని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు కటారి శంకర్, యరజర్ల సర్పంచ్ తమ్మిశెట్టి రాములమ్మశ్రీనివాస్, నాయకులు కృష్ణారెడ్డి, రాయపాటి అంకయ్య, మన్నె శ్రీనివాసరావు, చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చుంచు రామకృష్ణ, కన్వీనర్ సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపించాలి

- ఒంగోలు 27, 29, 30, 31 డివిజన్లలో బాలినేని రోడ్ షో

ఒంగోలు అర్బన్: కులమతాలకు అతీతంగా 25 ఏళ్లకుపైగా అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉన్నానని, ప్రస్తుత ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపిస్తే మరో ఐదేళ్లు ఆదుకుంటానని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రాత్రి ఒంగోలు నగరంలోని 27, 29, 30, 31 డివిజన్లలో రోడ్ షో నిర్వహించారు. ఆయా డివిజన్ల ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. పూలమాలలు, బాణసంచా, హారతులతో అట్టహాసంగా స్వాగతం పలికారు. సీతారామపురం వినాయకుడి దేవస్థానం వద్ద ప్రారంభమైన రోడ్ షో.. తాతా బిల్డింగ్స్, కోర్టు సెంటర్, రాజాపానగల్ రోడ్డు, గద్దలగుంట, మామిడిపాలెం మీదుగా వడ్డెపాలెం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ తాను చివరిసారిగా పోటీచేస్తున్నానని, ఆరోసారి గెలిపించి సిక్సర్ కొట్టేందుకు అవకాశమిచ్చి ఒంగోలు నియోజకవర్గ అభివృద్ధికి దోహదపడాలని ప్రజలను కోరారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఒంగోలు నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మిస్తానన్నారు. అంతేగాకుండా తాగునీటి సమస్యకు పూర్తి పరిష్కారం చూపి ప్రతిరోజూ తాగునీటి సరఫరా అయ్యేలా పనిచేస్తానన్నారు. నగరపాలకసంస్థ పరిధిలోని పేదలకు ఇచ్చిన మాట మేరకు సుమారు 22 వేల మందికి ఇంటి స్థలాలు రిజిస్టర్ చేసి పట్టాలు అందజేశామని, ఇంకా అర్హులుంటే వారికి కూడా ఇంటి స్థలాలు ఇస్తామని బాలినేని తెలిపారు. ఇంటి స్థలాలు పొందిన పేదలందరికీ గృహ నిర్మాణాలు చేపట్టి సొంత ఇంటి కలను నిజం చేస్తానని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా పేదలకు ఇచ్చిన పట్టాలను దొంగ పట్టాలని ప్రచారం చేసే దామచర్లకు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. కోవిడ్ సమయంలోనూ తాను సొంత నిధులతో ప్రజలకు సేవలందించానని గుర్తు చేశారు. అదే కోవిడ్ సమయంలో దామచర్ల జనార్దన్ కనీసం వారి పార్టీ కార్యకర్తల గురించి కూడా పట్టించుకోకుండా మొహం చాటేశారన్నారు. ప్రజలకు అండగా నిలిచే తనను గెలిపించాలని అభ్యర్థించారు. రోడ్ షోలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు జడా వెంకటేష్, ఫాతిమాబీ, చంద్రకళ, తస్నీరు నాగజ్యోతి, నాగేశ్వరరావు, డివిజన్ల అధ్యక్షులు పరమేశ్వరరావు, హిమాంసా, మురళీమోహన్, స్వరూప్, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కాకుమాను రాజశేఖర్, మాదాసి వెంకయ్య, గొర్రెపాటి శ్రీను, గంటా రామానాయుడు, కాకుమాను సునీల్‌రాజ్, బడుగు ఇందిర, ఇతర నాయకులు పాల్గొన్నారు.



భారీగా పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున, పక్కన శిద్దా రాఘవరావు, ఆర్యవైశ్య నాయకులు

- ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో మంత్రి మేరుగు నాగార్జున

సంతనూతలపాడు (చీమకుర్తి): సంతనూతలపాడు నియోజకవర్గంలోని ఆర్యవైశ్యులంతా తనను ఆదరించి ప్రస్తుత ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని, అండగా ఉండి అభివృద్ధి చేస్తానని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు అసెంబ్లీ అభ్యర్థి, మంత్రి మేరుగు నాగార్జున కోరారు. సంతనూతలపాడు నియోజకవర్గంలోని ఆర్యవైశ్యులతో ఒంగోలులోని ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మేరుగు మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ జరిగే ఎన్నికల పోలింగ్‌లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకునేందుకు సంతనూతలపాడు నియోజకవర్గంలోని ఆర్యవైశ్యులంతా ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. అందుకోసం తనను ఎమ్మెల్యేగా, నందిగం సురేష్‌ను బాపట్ల ఎంపీగా గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అర్హులందరికీ ఐదేళ్ల పాటు సంక్షేమ పథకాలు, కనీవినీ ఎరుగనీ రీతిలో అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ఆయనను మళ్లీ సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్యవైశ్య యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కొణిజేటి వెంకట సురేష్‌బాబు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా మేరుగు నాగార్జున, శిద్దా రాఘవరావు జ్యోతి ప్రజ్వలన చేశారు. వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ పరిశీలకులు డి.మల్లికార్జునరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ జి.పాండురంగారావు, ఆర్యవైశ్య సంఘ సంతనూతలపాడు మండల అధ్యక్షుడు జి.శరత్‌బాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం జాయింట్ సెక్రటరీ డి.రంజిత్‌కుమార్, ఆర్యవైశ్య యువజన సంఘం జిల్లా కార్యదర్శులు జి.పవన్‌కుమార్, హరీష్‌గుప్తా, నాగులప్పలపాడు, మద్దిపాడు, చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల ఆర్యవైశ్య నాయకులు ఏ వేణు, సోమశేఖర్ గుప్తా, ఎస్.సుందరం, జీవీఎల్ ప్రసాదరావు, వి.శేషారావు, ఎస్.తిరుమలరావు, రామకృష్ణ, సీహెచ్ సుధాకర్, పి.అంజనేయులు, శ్రీనివాసరావు, ఎన్వీ సుబ్బారావు, ఏడుకొండలు, వాసవీ మహిళా అధ్యక్షురాలు సీహెచ్ చంద్రావతి, వాసవీ క్లబ్ అధ్యక్షుడు వేమూరి శేషారావు, సెక్రటరీ రాము, ట్రెజరర్ పి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేస్తేనే ఉజ్వల భవిష్యత్తు

కొత్తపట్నం: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలంతా ఫ్యాన్ గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తేనే భవిష్యత్ బాగుంటుందని కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి గత ఐదేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఇవన్నీ ఇలాగే విజయవంతంగా కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేసుకోవాలని కోరారు. అందుకోసం వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఒంగోలు ఎమ్మెల్యేగా బాలినేని శ్రీనివాసరెడ్డిని, ఎంపీగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మొత్తం 34 సంక్షేమ పథకాలు అమలు చేసి పేదలకు మేలు చేసిన జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చెరుకూరి వీరరాఘవరావు, మండల వ్యవసాయ సొసైటీ అధ్యక్షుడు నాటరు తిరుపతిరెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు బంకాశ్రీధర్, కోడూరి శ్రీను, రమ, మేరి, బట్టు ప్రభాకర్, పెద్ది కృష్ణారెడ్డి, తంబి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పూల వ్యాపారులకు చేయూతనిస్తా

- ఆత్మీయ సమావేశంలో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



ఎమ్మెల్యే బాలినేనికి స్వాగతం పలుకుతున్న నాయకులు, వ్యాపారులు

ఒంగోలు టౌన్: నగరంలోని పూల వ్యాపారులు, కొబ్బరి బోండాల వ్యాపారులతో పాటు చిరువ్యాపారులందరికీ అన్ని విధాలుగా అండగా ఉంటానని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. నగరంలోని అద్దంకి బస్టాండ్ సెంటర్లో గల కేబీ కాంప్లెక్స్‌లో పూల వ్యాపారులు, కొబ్బరి బోండాల వ్యాపారులతో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎస్ఎంఎస్ ఫ్రూట్స్ అధినేత షేక్ మహబూబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో బాలినేని ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం జరిగిందన్నారు. ప్రస్తుత సంవత్సరంలో పంపిణీ చేయాల్సిన సంక్షేమ పథకాల నగదును చంద్రబాబు అడ్డుకోవడం దురదృష్టకరమన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఉన్న 2019 ఎన్నికల సమయంలో పోలింగ్ తేదీకి వారంలోపు కూడా పసుపు కుంకుమ పథకం పేరిట డబ్బులు పంపిణీ చేసినా జగనన్న అడ్డు చెప్పలేదని గుర్తు చేశారు. ఇప్పటికే వలంటీర్ల ద్వారా అవ్వాతాతలకు ఇస్తున్న పింఛన్లను అడ్డుకున్న చంద్రబాబు.. ఇప్పుడు చేయూత, విద్యాదీవెన, రైతు భరోసా పథకాల లబ్ధిదారులకు బ్యాంకులలో డబ్బు జమకాకుండా అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. స్వార్థప్రయోజనాల కోసం ప్రజలను ఇబ్బందులు పెట్టడం పిరికితనమన్నారు. ప్రజలందరి ఆశీసులతో జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని, చిరువ్యాపారులు, నిరుపేదలు సంతోషంగా జీవించే విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తారని తెలిపారు. చంద్రబాబు నిరుపేదల వ్యతిరేకి అని, కేవలం ఎన్నికల్లో లబ్ధిపొందడానికి మాత్రమే అలవిగాని హామీలు ఇస్తున్నారని అన్నారు. అవేమీ నమ్మకుండా రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి జగనన్నను సీఎం చేయాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు కటారి శంకర్, నాయకులు సయ్యద్ ఉస్మాన్, సయ్యద్ మస్తాన్, షేక్ బాజీ, షేక్ సుభాని, సుబ్బారావు, అంజయ్య, వెంకటేశ్వర్లు, షేక్ రహంతుల్లా, షేక్ సుభాని, షేక్ నబి, యూసుఫ్ పాల్గొన్నారు.

కాపుల మద్దతు వైఎస్సార్ సీపీకే

- ఉమ్మడి ప్రకాశం జిల్లా కాపు యువసేన అధ్యక్షుడు బండారు సురేష్



మాట్లాడుతున్న ఉమ్మడి ప్రకాశం జిల్లా కాపు యువసేన అధ్యక్షుడు బండారు సురేష్

ఒంగోలు: వైఎస్సార్ సీపీకే కాపుల మద్దతు అని ఉమ్మడి ప్రకాశం జిల్లా కాపు యువసేన అధ్యక్షుడు బండారు సురేష్ అన్నారు. స్థానిక ప్రమీల విహార్‌లో శుక్రవారం జరిగిన కాపు యువసేన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో దూసుకుపోతున్న వ్యక్తికి కాపుల మద్దతు తెలపాల్సిన అవసరం ఉందన్నారు. కాపులంతా వైఎస్సార్ సీపీ ఫ్యాన్ ఫ్యాన్‌పై ఓటేసి అభివృద్ధిని స్వాగతిద్దామన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో బాలినేని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కాపులకు ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లుగా, దేవస్థానం బోర్డు చైర్మన్, సభ్యులుగా ప్రాధాన్యత కల్పించారన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పర్చూరు నియోజకవర్గానికి కాపు సోదరులకు వైఎస్సార్ సీపీ సీటు కేటాయించారన్నారు. కానీ టీడీపీ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఒక్క సీటు కూడా కేటాయించలేదన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపులో కాపులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఒంగోలులో మంచి మనిషి బాలినేని శ్రీనివాసరెడ్డిని, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డిని, పర్చూరులో యడం బాలాజీని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవడంలో కాపు యువతను చైతన్యం చేయాలని కాపు యువసేన నిర్ణయించిందన్నారు. సమావేశంలో కాపు యువసేన నాయకులు దాసరి పిచ్చయ్య, పోగుల మల్లికార్జునరావు, నరశింహశెట్టి విజయ్‌కుమార్, బీరాల మహేష్, పర్చూరు నియోజకవర్గ కన్వీనర్ పసుపులేటి శ్రీమన్నారాయణ, పసుపులేటి శ్రీనివాసులు, చలమయ్య, గంటా కన్నయ్య, బ్రహ్మ, శ్రీరాములు, కర్రి సుబ్బారావు, కర్రి శ్రీను, కర్రి వాసు, కారంశెట్టి నాగార్జున పాల్గొన్నారు.

ప్రతి రెండు గంటలకు ఓటింగ్ సరళిపై బులెటిన్

- అక్రెడిటేషన్, ఎన్నికల సంఘం గుర్తింపు కార్డులున్న పాత్రికేయులకు నిబంధనల మేరకు కవరేజీకి అనుమతి
- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఈ నెల 13వ తేదీ జరిగే ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి ఓటింగ్ సరళి, పోలింగ్ శాతం, తదితర వివరాలను ప్రతి రెండు గంటలకు ఒకసారి మీడియాకు ప్రత్యేక బులెటిన్ ద్వారా అందజేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ప్రకాశం భవనంలో పాత్రికేయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పోలింగ్ ప్రక్రియలో మీడియా అనుమతి, పరిమితులపై అవగాహన కల్పించారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు ఎటువంటి ఎగ్జిట్ పోల్స్ సర్వేను ప్రసారం చేయకూడదన్నారు. ఎన్నికల చివరి 48 గంటల్లో అభ్యర్థులు మీడియా ద్వారా ఏమైనా ప్రకటనలు ఇవ్వాలంటే ముందుగా జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన జిల్లా ఎంసీఎంసీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల కవరేజీకి వెళ్లే అక్రెడిటేషన్ కార్డులున్న పాత్రికేయులు ఆయా పోలింగ్ కేంద్రాల్లోని ఓటర్ల క్యూ లైన్ ఫొటోలు, వీడియోలు తీసుకునేందుకు ఎన్నికల సంఘం నిర్దేశించిన భద్రతాపరమైన 100 మీటర్ల దూరం లోపలికి అనుమతిస్తారన్నారు. ఎన్నికల సంఘం జారీచేసిన ప్రత్యేక గుర్తింపు కార్డు ఉన్న పాత్రికేయులను పోలింగ్ గది వరకు అనుమతిస్తారన్నారు. రహస్య ఓటింగ్ విధానానికి భంగం కలగకుండా ఫొటోలు వీడియోలు తీసుకోవచ్చన్నారు. పోలింగ్ ప్రక్రియ ప్రెస్ కవరేజీ విషయాలపై మీడియాకు అనుమతి, పరిమితులపై స్పష్టత ఇస్తూ రిటర్నింగ్ అధికారులు, పోలీసులు అధికారులకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఐపీఆర్‌ఓ గ్రేస్ లినోరా, డీపీఆర్‌ఓ రమేష్, డివిజనల్ పీఆర్‌ఓ దుర్గాప్రసాద్, ఇతర అధికారులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

వేసవిలో పశుపోషణపై జాగ్రత్తలు తీసుకోవాలి



రైతులకు సూచనలిస్తున్న జిల్లా పశుసంవర్థక శాఖాధికారిణి బేబీరాణి

నాగులుప్పలపాడు: వేసవిలో పశువుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పశుసంవర్థక శాఖ అధికారిణి బేబీరాణి సూచించారు. వేసవి కాలంలో పశువుల పోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మండలంలోని అమ్మనబ్రోలు గ్రామంలోని పశువైద్య కేంద్రాన్ని సందర్శించి స్థానిక పాడి రైతులతో ఆమె మాట్లాడారు. వేసవి కాలం పాడి పరిశ్రమకు గడ్డుకాలమని, ఈ కాలంలో నల్లజాతి పశువులపై అధిక ప్రభావం ఉంటుందని తెలిపారు. పశువులు మేత తినకపోవటం వలన పాల దిగుబడి తగ్గడంతో పాటు డీహైడ్రేషన్‌కు గురై ఆరోగ్య సమస్యలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు. వేసవిలో పశువులను ఉదయం 10 గంటల్లోపు మేతకు తీసుకెళ్లాలని, ఆ తర్వాత సాయంత్రం 3 గంటలు దాటిన అనంతరం మాత్రమే పశువులను మేతకు పొలాలకు తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం రోగ నిరోధక శక్తిని పెంపొందించేందుకు ఖనిజ లవణ మిశ్రమం (మినరల్ మిక్చర్) ప్యాకెట్లను పాడిరైతులకు అందించారు. కార్యక్రమంలో అమ్మనబ్రోలు పశువైద్యాధికారిణి డా.జి.వి.సురేఖ, పశుసంవర్థక సహాయకులు కేజియం, అటెండర్ సురేష్ పాల్గొన్నారు.

పేదల పక్షపాతి.. బాలినేని

- ఎన్నికల ప్రచారంలో బాలినేని శచీదేవి



ఒంగోలు 32వ డివిజన్ గద్దలగుంటలో ఓట్లు అభ్యర్థిస్తున్న బాలినేని శచీదేవి

ఒంగోలు అర్బన్: నిత్యం పేదలకు మేలు చేసే స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని వైఎస్సార్ సీపీ ఫ్యాను గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఆయన సతీమణి బాలినేని శచీదేవి కోరారు. శుక్రవారం స్థానిక 32వ డివిజన్‌లో బాలినేని సోదరి రమణమ్మతో పాటు శచీదేవి ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లుగా చేసిన అభివృద్ధిపై కరపత్రాలు పంపిణీ చేస్తూ ఓట్లు అభ్యర్థించారు. ప్రజలందరినీ సొంత వారిగా చూసే బాలినేనికి మద్దతుగా నిలవాలని కోరారు. వైఎస్సార్ సీపీ పాలనలో అమలైన సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలంటే జగన్‌ను మళ్లీ సీఎంను చేసుకోవాలని కోరారు.

ఒంగోలు నగర అభివృద్ధి బాలినేనితోనే సాధ్యమన్నారు. ఆయనను మళ్లీ గెలిపించి అభివృద్ధిని కొనసాగించేందుకు సహకరించాలని శచీదేవి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ తాడి కృష్ణలత, డివిజన్ అధ్యక్షుడు కోసూరి శేఖర్, కోసూరి రాధా, తోటపల్లి సోమశేఖర్, రాహుల్, మన్నెపల్లి అంకబాబు, కొల్లా అశోక్, ఓగిరాల వెంకట్రావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.



2వ డివిజన్ బిలాల్‌నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బాలినేని శ్రీకావ్య

2వ డివిజన్‌లో శ్రీకావ్య ప్రచారానికి విశేష స్పందన

ఒంగోలు నగరంలోని 2వ డివిజన్ బిలాల్‌నగర్‌లో ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి కోడలు శ్రీకావ్య శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన లభించింది. వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా పాల్గొని ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. వారితో కలిసి ఇంటింటికి తిరిగి వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ప్రజలను శ్రీకావ్య కోరారు. ఒంగోలు ఎమ్మెల్యేగా బాలినేని శ్రీనివాసరెడ్డిని, ఎంపీగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని గెలిపించడం ద్వారా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేసుకోవాలని పిలుపునిచ్చారు.

దళిత వ్యతిరేకి.. చంద్రబాబు



పీవీ రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చెన్నయ్య, తదితరులు

ఒంగోలు: చంద్రబాబు దళిత వ్యతిరేకి అని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిళ్లా చెన్నయ్య విమర్శించారు. శుక్రవారం స్థానిక మాలమహానాడు కార్యాలయంలో మాలమహానాడు రాష్ట్ర వ్యవస్థాపకుడు పీవీ రావు 72వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ రావుతో తన అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఏబీసీడీ వర్గీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రంలోని దళితులను పెద్ద ఎత్తున ఐక్యం చేసుకుని హైదరాబాదులో ధర్నా చేస్తే అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు లాఠీచార్జి చేయించి ముగ్గురు దళితుల ఉసురు తీయించాడన్నారు. కేవలం అతని రాజకీయ లబ్ధి కోసం దళితులను విడగొట్టి పాలించే తత్వాన్ని చంద్రబాబు అలవరచుకున్నాడని అన్నారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్నే మార్చాలని యత్నిస్తున్న బీజేపీ కూటమికి తగిన గుణపాఠం చెప్పేందుకు దళితులు ఐక్యం కావాలన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు డీసీహెచ్ మాలకొండయ్య, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.